# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
- భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు.
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంత్రులంతా పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.
- రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
- నైరుతి పశ్చిమ దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజులలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================

సత్ప్రవర్తన కలిగిన 17 మంది జీవిత ఖైదీల విడుదలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడిస్తూ… ఖాగారాల్లో సంస్కరణలు తేవాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. రాష్ట్రంలో పోలీసు అకాడమీ ఏర్పాటుకు అదనంగా 94.45 ఎకరాలు ఇస్తున్నామని తెలిపారు. అలాగే వివిధ సంస్థలకు చేసిన భూకేటాయింపులకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం లభించిందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

======================

భారతదేశం త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... 2014లో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు తీసుకునే నాటికీ దేశం 11వ ఆర్థిక వ్యవస్థగా ఉండేదని వెల్లడించారు. గడచిన కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ప్రస్తుతం దేశం 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తు చేశారు. 2047 నాటికీ వికసిత్ భారత్, విశ్వ గురు దేశంగా భారతదేశం ఆవిర్భవించాలని ఆయన ఆకాంక్షించారు.

======================

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేసుకుని మంత్రులంతా మరింత సమర్థంగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంత్రులు ప్రజలతో మమేకం కావాలన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన బాగుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరుగుతోందని చెప్పారు. నేరం రుజువయ్యాక ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిని శిక్షించటమే ప్రభుత్వ విధానమని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజలు తీర్పు ఇచ్చి సంవత్సరం అయిన సందర్భంగా మంత్రివర్గ సమావేశంలో ఈ రోజు చర్చ జరిగింది. ఈ ఏడాది కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

======================

రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర పేరుతో ప్రతీ రోజు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ గంగవరం ప్రభుత్వ జూనియర్ కళా శాల  ప్రాంగణంలో సుమారు 5 వేల మంది గిరిజనులతో ఈ రోజు నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు పల్నాడు జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన అనుపు వద్ద ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఇదిలా  ఉండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి కోట వద్ద సుమారు 3 వేల మందితో ఈ రోజు యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని  తదితరులు పాల్గొన్నారు.

======================

ప్రజా సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధిక  ప్రాధాన్యత  ఇస్తోందని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం రైల్వేస్టేషన్ లో ఈ రోజు ఆయన అనంతపురం – బెంగళూరు మెము రైలుని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఈ రైలు రెండూ నగరాల మధ్య రవాణా సౌలభ్యాన్ని పెంచి, ప్రజలకు ప్రయాణంలో మరింత సౌకర్యాన్ని అందించనుందని చెప్పారు.

విరామం

======================

సరిహద్దుల నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు భారతదేశం తీసుకుంటున్న చర్యల గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున అఖిల పక్ష బృందాలు గత కొద్ది రోజులుగా విదేశాల్లో పర్యటిస్తున్నాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు రవి శంకర్ ప్రసాద్ నాయకత్వంలోని అఖిల పక్ష బృందం బెల్జియమ్ దేశాన్ని ఈరోజు సందర్శించింది. కాశ్మీర్ లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి గురించి ఆ దేశం పాలకులకు వివరించామని  బృందంలో సభ్యురాలైన రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. ఈ

మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ద్వారా ఈ పర్యటన వివరాలను ఆమె వెల్లడిస్తూ... భారత్ తలపెట్టిన ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు బెల్జియం నుంచి మద్దతు లభించిందని చెప్పారు.

=======================

రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే డి.ఎస్.సి. పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. డిఎస్సికి చేయాల్సిన ఏర్పాట్లపై తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో ఈ రోజు ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు డిఎస్సి పరీక్ష జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. దీని కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 36 వేల 495 మంది దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.

=======================

రానున్న నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ద్వారా మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల ఫలితాలు వచ్చి ఈ రోజుతో ఏడాది పూర్తి అయిన సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. చారిత్రాత్మకమైన విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.

=======================

వికలాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరకులను సరఫరా చేయడం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ రోజు పార్వతీపురం మండలం యం.ఆర్.నగర్ గ్రామంలో రేషన్ డిపోను ఆయన తనిఖీ చేశారు. చౌక ధరల దుకాణం వద్దకు రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులకు స్వయంగా తూకం వేసి రేషన్ సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతి నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ సరకులు అందుబాటులో ఉంటాయని, ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో చౌక ధరల దుకాణాలు వద్ద తీసుకోవచ్చని చెప్పారు.

=======================

ఏడాది పాలనలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని పేర్కొంటూ... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ర్యాలీలు జరిగాయి. భీమవరంలో జరిగిన ర్యాలీలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ఎంఎల్సీ కౌలు శ్రీనివాస్, తాడేపల్లిగూడెంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ నాయకత్వం వహించారు.

=======================

తిరుమలలో ఈ రోజు వేకంటేశ్వర స్వామి సర్వదర్శనానికి 16 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న అర్ధరాత్రి వరకు స్వామి వారిని 78 వేల 631 మంది భక్తులు దర్శించుకున్నారని చెప్పారు.

=======================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి పశ్చిమ దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాగల మూడు రోజులలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే  అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారిణి తెలియచేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

=======================

=======================